సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 10 । జూన్ । 2025



వినియోగదారులు చేజారకుండా..
సింగరేణిలో వివిధ రకాల బొగ్గును కలిపి జీ-13 గ్రేడ్‌గా మార్చి వినియోగదారులకు సరఫరా చేయాలని నిర్ణయించారు. 8లో



రాజీవ్ యువ 'విలాపం'!
నిరుద్యోగులకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రకటించి, అమలును వాయిదా వేయడంతో అర్హుల్లో నిరాశ అలుముకుంది. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
40° / 27°
జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం వరకూ వడ గాలుల ప్రభావం కొనసాగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు కల్యాణంలో పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సుజాతనగర్: స్థానిక ప్రభుత్వాస్పత్రిని జిల్లా వైద్యాధికారి ఎల్.బాస్కర్ నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రిలో సేవలు ఎలా ఉన్నాయంటూ పేషెంట్లను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించిన తర్వాత మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, శిశు మరణాలు తగ్గించాలని ఆదేశించారు. గర్భిణుల ఇంటికి వెళ్లి ఆరోగ్య సూచనలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఐసెట్



పరీక్షకు హాజరైన విద్యార్థులు

సుజాతనగర్: స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఐసెట్ రెండో రోజైన సోమవారంతో ముగిసింది. మొత్తం 130 మందికి గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

స్వయం ఉపాధి కోసమే దరఖాస్తు చేయాలి



విద్యార్థినికి ఆర్థిక సాయం అందిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన దర్బార్‌లో స్వయం ఉపాధి పథకాలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం స్వీకరించబోమని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన పలువురి నుంచి దరఖాస్తులు స్వీకరించి.. పరిష్కారానికి యూనిట్ అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజన దర్బార్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్వయం ఉపాధి, ఇతర సమస్యలపై మాత్రమే దరఖాస్తులు అందించాలని, ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు, పాఠశాల, కళాశాలల్లో సీట్లు నోటిఫికేషన్ ద్వారానే భర్తీ చేస్తామని వెల్లడించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని, విద్యార్థులకు అన్ని వసతులతో స్వాగతం పలకాలని సూచించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం..
అశ్వారావుపేట మండలం బండారు గుంపు గ్రామానికి చెందిన నిరుపేద గిరిజన విద్యార్థిని వైశాలిరెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో బీఏలో సీటు సాధించగా.. మొదటి, రెండో సంవత్సరాలకు ఐటీడీఏ ద్వారానే ఆర్థిక సాయం అందజేశారు. కాగా ఇతర కోర్సు, హాస్టల్ ఫీజు నిమిత్తం సోమవారం ఆమెకు రూ.19,280 చెక్కును పీఓ అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఈఈ హరీష్, ఎస్‌ఓ భాస్కరన్, ఏఓ సున్నం రాంబాబు, ఏపీఓ వేణు, అధికారులు లక్ష్మీనారాయణ, ఉదయ్‌కుమార్, మనిధర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

కూనంనేనికి ఊరట





పాల్వంచలో బాణసంచా కాల్చుతూ సంబరాలు చేస్తున్న సీపీఐ నాయకులు (ఇన్‌సెట్) కూనంనేని సాంబశివరావు

- అనర్హత పిటిషన్‌ను డిస్మిస్ చేసిన హైకోర్టు
- 2024 జనవరిలో దాఖలైన పిటిషన్
- ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిన న్యాయస్థానం
- 20సార్లకు పైగా కొనసాగిన వాదనలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినందున కూనంనేనిపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. అంతకుముందు ఏడాదిన్నర పాటు ఈ పిటిషన్‌పై వాదోపవాదాలు జరిగాయి.

గెలిచిన వెంటనే..
తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో ఎన్నికలు జరిగాయి. అయితే నామినేషన్ దాఖలు సమయంలో ఫామ్-26 అఫిడవిట్‌లో కూనంనేని సమగ్ర వివరాలు వెల్లడించలేదంటూ కొత్తగూడేనికి చెందిన నందూలాల్ అగర్వాల్ 2024 జనవరి 20న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కూనంనేని తన భార్య పేరును అఫిడవిట్‌లో పేర్కొనలేదని, లైసెన్స్‌డ్ నోటరీతో అఫిడవిట్ చేయించలేదనే అభ్యంతరాలను నందూలాల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ కొనసాగుతుండగానే మరింత సమాచారం కోసం గతేడాది డిసెంబర్‌లో హైకోర్టు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ఈ ఏడాది జనవరిలో కూనంనేని సాంబశివరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నందూలాల్ అగర్వాల్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ కొట్టేయాలని కోరారు. అయితే హైకోర్టులో వాదనలు పూర్తి కాకుండా ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ కూనంనేని పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో అనర్హత కేసు ఏ మలుపు తీసుకుంటుందోననే ఆసక్తి గడిచిన ఆరు నెలలుగా కొనసాగింది.

తుది తీర్పు వచ్చాక..
ఏడాదిన్నర వ్యవధిలో ఇటు కమిషన్, అటు హై కోర్టులో 20 సార్లకు పైగా ఇరు వర్గాల నడుమ వాదనలు జరిగాయి. చివరకు ఈ కేసులో తీర్పును ఈనెల 9కి రిజర్వ్ చేసినట్టు 7వ తేదీన హైకోర్టు తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. దీంతో ఈ కేసులో తీర్పు ఏ రకంగా ఉంటుందనే ఉత్కంఠ రెండు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొంది. సీపీఐతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్ ఈ తీర్పుపై ఆసక్తి చూపించింది. అయితే నందూలాల్ అగర్వాల్ లేవనెత్తిన అభియోగాల్లో మెరిట్స్ లేనందున ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు సోమవారం హైకోర్టు వెల్లడించింది. కూనంనేనికి అనుకూలంగా తీర్పు రావడంతో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో సీపీఐ కార్యకర్తలు సంబరాలు చేసుకుని మిఠాయిలు పంచుకున్నారు. రెండు పట్టణాల్లోనూ ర్యాలీలు తీశారు.

గతంలో వనమాపై..
ఎన్నికల అఫిడవిట్‌లో వివరాలు, అనర్హత అంశంపై కొత్తగూడెం నియోజకవర్గం మరోసారి వార్తల్లో నిలిచింది. 2018 ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు గెలిచారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పూర్తి వివరాలు పేర్కొనలేదంటూ ఆ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన జలగం వెంకట్రావ్ 2020లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మూడేళ్లకు పైగా విచారణ తర్వాత వనమా ఎన్నిక చెల్లదని, ఆ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలని 2023 జూలైలో తీర్పు వెలువడగా.. వనమా సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అక్కడ విచారణ దశలో ఉండగానే 2023 నవంబర్ 30న ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో వనమా ఓడిపోగా కూనంనేని సాంబశివరావు గెలుపొందారు. ఫలితా లు వెలువడిన మరుసటి నెలలో కూనంనేని ఎన్నికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో కొత్తగూడెం అసెంబ్లీ స్థానం, ఇక్కడి రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది.

సీపీఐ శ్రేణుల సంబరాలు..
కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ/సుజాతనగర్ : కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అనర్హత పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌లో సీపీఐ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కొత్తగూడెంలో సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నుంచి మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో బాణ సంచా పేల్చి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. పాల్వంచలో అంబేడ్కర్ సెంటర్ వద్ద బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొంత మంది దురుద్దేశంతో కూనంనేనిపై అనర్హత పిటిషన్ వేశారని, అయినా న్యాయం తమ వెంటే ఉందని అన్నారు. ఇది ప్రజల విజయమని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ముత్యాల విశ్వానాథం, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, సాయిబాబా, రాహుల్, రెహమాన్, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, భూక్యా దస్రు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, వీర్ల మల్లేష్, తాళ్లూరి ధర్మారావు, బొడ్డు కేశరావు మూడు గణేష్, మహ్మద్ యూసఫ్, ఎస్‌కే ఫహీమ్, శ్రీనివాస్, సత్యనారాయణ చారి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే మా అజెండా



రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి, టీ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ తదితరులు

- వచ్చే పదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం
- పార్టీ కోసం కష్టించిన కార్యకర్తలందరికీ పదవులు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, పొన్నం, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం: పదేళ్ల తెలంగాణలో ఆర్థిక విధ్వంసం కొనసాగగా.. తాము అధికారంలోకి రాగానే నెమ్మదిగా సరిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రఘునాథపాలెంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి టీ పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి మాట్లాడారు. దేశంలో ఎవరూ చేయని విధంగా కులగణన పూర్తి చేసి, అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కోటి కుటుంబాలకు సన్న బియ్యం ఇస్తున్న చరిత్ర తెలంగాణకే దక్కుతుందని చెప్పారు. అలాగే మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు, రూ.500కే సిలిండర్, రైతులకు రుణమాఫీ, యువతకు ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. అయితే, పదేళ్ల పాటు దోపిడీ చేసిన ధనంతో బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిపించాలని, కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతీ కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సర్దార్ సర్వాయి పాపన్న వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని గౌడ సంఘం హాల్ నిర్మాణం చేపట్టడమే కాక ఆయన విగ్రహం ఏర్పాటు చేసి కోచింగ్ సెంటర్ కూడా నిర్మించాలని కోరారు. ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తయ్యేలా తన సహకారం ఉంటుందని భట్టి తెలిపారు.

ఖమ్మం అంటేనే ధైర్యం..
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయానికి పలుమార్లు వచ్చానని తెలిపారు. ఖమ్మం అంటేనే ధైర్యమని, ఇక్కడి ప్రజల ఆశీస్సులతోనే అధికారంలోకి వచ్చామని చెప్పారు. గౌడ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేల నిధులతో కూడిన ప్రత్యేక సాయాన్ని అందిస్తామని వెల్లడించారు. విద్యను ప్రోత్సహించేలా కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని వెల్లడించారు. కార్యకర్తలు దేవుళ్లని, పార్టీ కార్యాలయం ఆలయమని వెల్లడించిన ఆయన.. కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పేందుకే ఇక్కడికి వచ్చామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తోడ్పడిన ఖమ్మం జిల్లాకు ప్రభుత్వంలోనూ ఎక్కువ ప్రాతినిధ్యం దక్కిందన్నారు. కాగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వచ్చే ఎన్నికల్లో 90 సీట్లకు పైగా గెలుస్తామని, రాబోయే పదేళ్లు కూడా అధికారంలో ఉంటామని మహేష్‌కుమార్ వెల్లడించారు. గౌడ హాల్ పేదలకు ఉపయోగపడేలా, సమాజానికి సేవ చేసేలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర గిడ్డంగులు, హస్తకళల సంస్థల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, నాగండ్ల దీపక్ చౌదరి, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్‌గౌడ్, ఏలూరి రవి, చింతల పుష్ప, భవాని, ప్రతిభారెడ్డి, బిచ్చాల తిరుమలరావు, డాక్టర్ రాజశేఖర్, బొల్లికొండ శ్రీనివాసరావు, కత్తి నెహ్రూగౌడ్, బోయనపల్లి లక్ష్మణ్, బండి నాగేశ్వరరావు, బండి వెంకన్న, వత్సవాయి రవి, బొర్రా రాజశేఖర్, పోతగాని వెంకటేశ్వర్లు, రాహుల్, కృష్ణ, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



సమీక్షలో మాట్లాడుతున్న వేణుగోపాల్, పక్కన విద్యాచందన తదితరులు

జూలూరుపాడు: భూ భారతి సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని కాకర్ల రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు అందించిన దరఖాస్తులను తక్షణమే ఆన్‌లైన్ చేయాలని, వివరాల నమోదులో తప్పులకు తావు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదు అందించాలని, రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. భూ రికార్డుల్లో పేర్ల తప్పులు, భూ విస్తీర్ణం హెచ్చుతగ్గులు, వారసత్వ భూములు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ పుస్తకం లేకపోవడం, సాదాబైనామా కేసులు తదితర సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. అనంతరం బేతాళపాడులోనూ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ టి. శ్రీనివాస్, ఆర్ఐ సీహెచ్.ఆదినారాయణ, ఏఎస్ఓ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

30 వరకు రేషన్ బియ్యం పంపిణీ..
సూపర్‌బజార్(కొత్తగూడెం): జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఈనెల 30వ తేదీ వరకు ఒకేసారి పంపిణీ చేస్తున్నామని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

58 వేల యూనిఫామ్‌ల తయారీ పూర్తి..
కొత్తగూడెంఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 58 వేల యూనిఫామ్ తయారు చేసి పాఠశాలలకు అందించామని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, సీఎస్ కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సమాఖ్యల ద్వారా పెట్రోల్ బంక్ నిర్వహణకు రామవరంలో 12 కుంటల భూమి గుర్తించామని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరా చారి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్య విభూషణ బిరుదు ప్రదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం దేవస్థాన సంస్కృత పండితుడు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులుకు విద్య విభూషణ బిరుదు ప్రదానం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం నాసిక్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, ఆచార్య వేదాంత విద్యాపీఠం శ్రీలాల్ బహుదూర్ శాస్త్రి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ బిరుదును అందజేశాయి. అనంతరం శ్రీ మన్నారాయణచార్యులు దంపతులను పలువురు ఘనంగా సత్కరించారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



స్వచ్ఛ కార్మికులతో డీఈఓ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచాలని, విరివిగా మొక్కలు నాటాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి సూచించారు. జిల్లాలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్వచ్ఛ మిత్రలకు జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులకు ఎలాంటి అనారోగ్యాలు దరి చేరకుండా ఉంటాయని, మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి అందుతుందని అన్నారు. అనంతరం వారికి యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సతీష్‌కుమార్, జిల్లా కో ఆర్డినేటర్లు నాగ రాజశేఖర్, సైదులు, శంకర్, డీఆర్పీ రాజేష్ పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్టు అప్రజాస్వామికం



కొత్తగూడెంలో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కొత్తగూడెంఅర్బన్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అప్రజాస్వామికమని కొత్తగూడెంలోని జర్నలిస్టులు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు అన్నారు. శ్రీనివాసరావు అరెస్టును ఖండిస్తూ సోమవారం రాత్రి కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కక్ష గట్టి సాక్షి దినపత్రిక, న్యూస్ చానల్‌పై దాడులు చేస్తోందని, అక్రమ అరెస్టులు చేయడం జర్నలిజంపై గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. ప్రజలకు – ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులకు స్వేచ్ఛ లేకుండా, వారి మాటలను తప్పుబడుతూ, అధికారం ఉందనే అహంకారంతో అరెస్టు చేయడాన్ని అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సాక్షిలో పనిచేసే ముఖ్యులను టార్గెట్ చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇలాంటి చర్యలతో ప్రజాస్వామ్యంలో పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మేధావులు, సమాజంలోని అన్ని వర్గాల వారు ముందుకు రావాలని కోరారు. అక్రమ అరెస్టులతో ఇబ్బంది పెడుతున్న పచ్చ ప్రభుత్వం భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సాక్షి, వెలుగు, నమస్తే తెలంగాణ, ప్రజాజ్యోతి పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు తాండ్ర కృష్ణ గోవింద్, రాజేందర్, వెంకన్న, అశోక్, జర్నలిస్టులు భాస్కర్‌రెడ్డి, జునుమాల రమేష్, వీరు, రేశ్వంత్, తారక్, ఈశ్వర్, వాసాల శేఖర్, కృష్ణారావు, సాయి ప్రసాద్ రెడ్డి, రాము, గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గెర్షోము తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుకే సై



పత్తి గింజలు వేస్తున్న కూలీలు

- తెల్లబంగారం వైపే మొగ్గుచూపుతున్న రైతులు
- మద్దతు ధర పెరగటంతో ఆసక్తి
- జిల్లాలో పెరగనున్న పంట సాగు
- సీసీఐ కొనుగోళ్లతో మార్కెటింగ్ సౌలభ్యం



బూర్గంపాడు: జిల్లాలో ఈ ఏడాది పత్తి సాగు మరింతగా పెరగనుంది. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాకు రూ.589 మద్దతు ధర పెంచగా రూ. 8,110కి చేరింది. దీంతో సాగు విస్తీర్ణం అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక పత్తిని సీసీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుండగా రైతులకు మార్కెటింగ్ సౌలభ్యం కూడా ఉంది. దీనికి తోడు గత రెండేళ్లుగా మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడం, దిగుబడి తగ్గడం, మార్కెటింగ్ వసతులు లేకపోవడం వంటి కారణాలతో ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆ భూముల్లోనూ ఈసారి పత్తి సాగయ్యే అవకాశం ఉంది.

ఆది నుంచీ ఇటు వైపే..
జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే పంటగా పత్తికి మొదటి ప్రాధాన్యత దక్కుతుంది. దిగుబడి తగ్గి, గిట్టుబాటు ధర లభించకపోయినా రైతులు ఈ పంట సాగును వదలడం లేదు. గత రెండేళ్లుగా ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పత్తి ఆశించిన దిగుబడి రాలేదు. ఎకరాకు సగటున 6, 7 క్వింటాళ్లు మాత్రమే పండింది. ప్రైవేట్ వ్యాపారులు గిట్టుబాటు ధర పెట్టలేదు. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో నాలుగు జిన్నింగ్ మిల్లుల వద్దనే పత్తి కొనుగోలు చేయగా.. రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రవాణా, హమాలీ చార్జీలు వారే భరించాల్సి వచ్చింది. అయితే ఈ ఏడాది జిల్లాలో మరో రెండు జిన్నింగ్ మిల్లులు అందుబాటులోకి రానున్నాయి. బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో గతంలో ఒక జిన్నింగ్ మిల్లు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది మరో రెండు జిన్నింగ్ మిల్లులు అందుబాటులోకి రానున్నాయి. పత్తికి మద్దతు ధర పెరగడం, జిన్నింగ్ మిల్లులు అదనంగా అందుబాటులోకి రావడంతో రైతులు ఈ పంట వైపే మొగ్గు చూపుతున్నారు.

తగ్గనున్న మిర్చి సాగు..
జిల్లాలో గతేడాది మిర్చిసాగు విస్తీర్ణం బాగా పెరిగింది. అయితే నల్లి, తామర వంటి చీడపీడలతో పాటు ఆశించిన ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగు మరింతగా తగ్గే అవకాశాలున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పప్పు గింజలకు డిమాండ్ ఉంది. గత ఐదారేళ్లుగా కంది, మినుము, పెసర, శనగ, బొబ్బెర వంటి పప్పు గింజల ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం పప్పు గింజల ధర క్వింటాకు రూ.10వేల వరకు ఉంది. అయినా పప్పు ధాన్యాల సాగుకు రైతులు మాత్రం అనాసక్తి కనబరుస్తున్నారు. వాణిజ్య పంటల సాగుకు అలవాటు పడిన రైతులు సంప్రదాయ అపరాల సాగుకు విముఖత చూపుతున్నారు.

2లక్షల ఎకరాలకు పైగా..
గతంలో జిల్లాలో సుమారు 1.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది అది 2.20 లక్షల ఎకరాలకు పెరిగే అవకాశం ఉంది. ఇందులో 95శాతం మేర వర్షాధారంగానే సాగు చేస్తున్నారు. నీటి పారుదల అవకాశాలున్న భూముల్లో వరి, కూరగాయలు, ఆయిల్‌పామ్, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. మెట్టభూముల్లో మాత్రం అగ్రభాగం పత్తిదే.

పత్తే వేస్తున్నాం



గత రెండేళ్లుగా మిర్చి వేసి నష్టపోయాను. ఈ ఏడాది మిర్చికి బదులు పత్తి వేస్తున్నా. పత్తికి మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నా.. సీసీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర అందిస్తోంది. మిర్చి అమ్ముకోవాలంటే గుంటూరు లేదా జగదల్‌పూర్ వెళ్లాల్సి వస్తోంది. మిర్చి నిల్వ చేద్దామంటే జిల్లాలో కోల్డ్ స్టోరేజీలు లేవు. దీంతో రైతులు పత్తిసాగుకే మొగ్గు చూపుతున్నారు.

– తెల్లం భాస్కర్, రైతు, గుండాల

క్లుప్తంగా

అక్రమ కట్టడం తొలగింపు



నిర్మాణాన్ని తొలగిస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్: ఐడీటీఏ రోడ్‌లోని రాజీవ్ నగర్‌కాలనీలో ఉన్న శ్రీ కుసుమ హరినాథ్ బాబా దేవస్థానం భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాన్ని పాలకమండలి ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. సర్వే నంబర్ 91/1లో ఆలయానికి చెందిన పట్టా భూమి 3-57 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణానికి సెంట్రింగ్ పెట్టగా పాలక మండలి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు తంబళ్ల కృష్ణార్జున రావు, సీత, ఆలయ ఈఓ జి. సుదర్శన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డులకు పరుగు పందెం



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని ఖాళీగా ఉన్న 10 ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పోస్టుల నియామకానికి సోమవారం పరుగు పందెం నిర్వహించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన ఈ పరుగు పందెంలో 240 మంది పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ చూపిన 10 మందిని ఎంపిక చేశారు. వీరికి మెడికల్ చెకప్ నిర్వహించి, సర్టిఫికెట్లు పరిశీలించాక నియామకాలు చేపట్టనున్నారు.

80 మందికి జరిమానా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో 80 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు సోమవారం తీర్పుచెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో వాహన చోదకులను బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలడంతో కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానా విధించారు.

కరోనా మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా



మృతుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేస్తున్న రాజశేఖర్

సింగరేణి(కొత్తగూడెం): కోవిడ్-19లో సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా రైటర్‌బస్తీలో కరోనా బారిన పడి సివి ల్ విభాగం కాంట్రాక్ట్ కార్మికుడు కొదురుపాక శ్రీనివాస్ మృతిచెందా డు. మృతుడి కుటుంబ సభ్యులు కొదురుపాక రాజకుమారి తదితరులకు సోమవారం సివిల్ కార్యాలయం వద్ద సివిల్ డీజీఎం పి.రాజశేఖర్, గుర్తింపు కార్మిక సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి, ఉపాధ్యక్షులు క్రిష్టాఫర్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

పాల్వంచరూరల్: మేతకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మండల పరిధిలోని పాండురంగాపురం గ్రామ శివారులో సోమవారం ఈ సంఘటన జరిగింది. రూ.లక్ష నష్టం వాటిలినట్లు బాధిత రైతు జక్కుల వెంకటయ్య తెలిపాడు.

మట్టి లారీ స్వాధీనం

పాల్వంచరూరల్: అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న లారీని, జేసీబీని రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. తహసీల్దార్ దారా ప్రసాద్ కథనం ప్రకారం... మండల పరిధిలోని భోజ్యాతండా సమీపంలో మొర్రేడు వాగు చెక్కు డ్యామ్ వద్ద నుంచి మట్టిని తరలిస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వారి ఆదేశాలతో ఆదివారం రాత్రి రూరల్ ఆర్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మట్టి లారీని, జేసీబీని పట్టుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఉమాకర్(35) భార్య కొన్నేళ్ల అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపంతో బాధపడుతున్న ఆయన మద్యానికి బానిస కాగా, ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆయన తండ్రి, తమ్ముడు ఖమ్మంలో నివసిస్తున్నారు. ఈనెల 8వ తేదీన ఉమాకర్ పురుగుల మందు తాగగా గమనించిన స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా, ఆయన తండ్రి వెంకటనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజీవ్ యువ విలాపం!



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న సిబ్బంది(ఫైల్)

- యువ వికాసం పథకం అమలులో జాప్యం
- ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతీయువకులు
- ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు 1.60 లక్షలు
- కేటాయించిన మొత్తం యూనిట్లు 38,230

చుంచుపల్లి: రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జాప్యం జరుగుతుండటంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మే నెలలోగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఈ నెల 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని భావించింది. అనంతరం ఈ నెల 5న మంత్రివర్గ సమావేశంలో యువ వికాసంపై స్పష్టత వస్తుందని అంతా భావించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాకపోవడంతో యువతీయవకులు నిరాశ చెందుతున్నారు. దరఖాస్తులు వెల్లువలా రావడం, దరఖాస్తుల పరిశీలన ఓ కొలిక్కి రాకపోవడంతో అమలు ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీ ఇలా..

పథకంలో రూ.50వేల యూనిట్‌కు వందశాతం సబ్సిడీ, రూ.లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది. ఈ నాలుగు కేటగిరీల్లో రూ. 50వేలు, రూ.లక్ష యూనిట్లకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

'సిబిల్'కే బ్యాంకర్ల ప్రాధాన్యం..

యువ వికాసం దరఖాస్తులను మండల స్థాయిలో ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో పరిశీలించారు. తొలుత మండల కమిటీల ఆమోదం తర్వాత జిల్లా కమిటీలకు జాబితా చేరుతుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక కుటుంబంలో ఒకరికే ఈ పథకం మంజూరు చేస్తారు. గతంలో ఏదైనా కార్పొరేషన్ నుంచి లబ్ధి పొందారా?, బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించకుండా డిఫాల్టర్‌గా ఉన్నారా? అనే విషయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. మరోవైపు సిబిల్ స్కోర్‌ను పట్టించుకోవద్దని ప్రభుత్వం సూచించినా బ్యాంకర్లు మాత్రం దానికే ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిసింది.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు

కార్పొరేషన్	ఖమ్మం	భద్రాద్రి
బీసీ	39,616	20,602
ఎస్సీ	29,742	12,488
ఎస్టీ	14,416	27,792
మైనారిటీ	7,412	2,844
ఈబీసీ	4,022	1,049
క్రిస్టియన్	117	107

ఉమ్మడి జిల్లాలో 38,230 యూనిట్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల నుంచి 1,60,207 మంది యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం ఉమ్మడి జిల్లాకు 38,230 యూనిట్లను పంపిణీ లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో ఖమ్మంజిల్లాకు 20,181యూనిట్లు, భద్రాది జిల్లాకు 18,049 యూనిట్లు కేటాయించింది. మొదటి విడతలో కేటగిరీ-1లో రూ.50 వేలు, కేటగిరీ-2లో రూ. లక్ష వరకు ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి ఈనెల 15లోపు శిక్షణ ఇవ్వాలని తొలుత నిర్ణయించారు. అయితే అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే పథకం జాబితాలో స్థానం కల్పిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. ఈనెల 5న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కూడా యువ వికాసంపై ఎలాంటి చర్చ జరగలేదు. దీంతో పథకం అమలు మరింత జాప్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

అర్హుల ఎంపికలో పొరపాట్లు..

రాష్ట్రఆవిర్భావం దినోత్సవం రోజు పథకాన్ని ప్రారంభించాలని భావించినా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం, అర్హుల ఎంపికలో పొరపాట్లు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో మరింత లోతుగా విచారణ చేయాలని నిర్ణయించారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సాయం అందించాలని ప్రభుత్వం భావించి కార్యక్రమాన్ని వాయిదా వేసింది. ఎప్పటికప్పుడు వాయిదా పడుతుండటంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. కాగా పథకం అమలుకు మరో వారం, పది రోజుల్లో ప్రభుత్వం స్పష్టమైన తేదీ ప్రకటించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఆదేశాలు రావాల్సి ఉంది



రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఈ నెల 2న ప్రారంభించాలని భావించినా కొన్ని కారణాలతో వాయిదా వేసింది. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఇక ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు నడుచుకుంటాం. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తాం.

–బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ, రాజీవ్ యువ వికాసం జిల్లా కోఆర్డినేటర్



సత్తుపల్లిలోని సీహెచ్‌పీలో రైల్వే వ్యాగన్లలో నింపుతున్న బొగ్గు

వినియోగదారులు చేజారకుండా..

- నాణ్యమైన బొగ్గు సరఫరాకు సింగరేణి యాజమాన్యం చర్యలు
- హై గ్రేడ్ లో గ్రేడ్ కలిపి జీ-13 బొగ్గు రవాణాకు నిర్ణయం
- ఏరియాల జీఎంలకు ఆదేశాలు జారీ చేసిన డైరెక్టర్లు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉత్పత్తి చేస్తున్న జీ-15 గ్రేడ్ బొగ్గు స్వీకరణకు థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. ఫలితంగా రోజుకు 8 రేకుల (సుమారు 32 వేల టన్నుల) బొగ్గు నిల్వలు పేరుకుపోతున్నాయి. దీంతో ప్రతీ రోజు 42 రేకులకు బదులు 34 రేకులే రవాణా అవుతున్నాయి. మరోవైపు నిల్వ ఉన్న బొగ్గు కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఉండే అధిక ఉష్ణోగ్రతలతో అంటుకుని దగ్ధమయ్యే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సంస్థ ఉత్పతి చేస్తున్న జీ-10, జీ-11, జీ-13, జీ-14, జీ-15లతోపాటు మరికొన్ని గ్రేడ్‌లను కలిపి, జీ-13 గ్రేడ్‌గా మార్చి వినియోగదారులకు సరఫరా చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. కొంత నష్టం వచ్చినా వినియోగదారుడిని సంతృప్తి పరచాలనే ఉద్దేశంతో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు కంపెనీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని సీహెచ్‌పీల్లో అన్ని గ్రేడ్‌లను కలిపి జీ-13 బొగ్గు సరఫరా చేయాలని జీఎంలకు ఆదేశాలు జారీ చేసింది.

కోల్‌వాషరీల ద్వారా 60శాతమే చేతికి..

సింగరేణి సంస్థ రోజుకు సుమారు 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తోంది. ఇందులో 80 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రవాణా చేస్తుండగా, మిగిలిన 20శాతం మాత్రం విద్యుత్తేతర పరిశ్రమలకు రవాణా చేస్తోంది. 20 శాతం కొనుగోలు చేస్తున్న సంస్థలతో ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ 80శాతం కొనుగోలు చేస్తున్న పరిశ్రమలే కొర్రీలు పెడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కొన్ని ప్రైవేట్ సంస్థలు సింగరేణి కంటే నాణ్యమైన బొగ్గును తక్కువ ధరకే రవాణా చేస్తున్నాయి. దీంతో విద్యుత్ కంపెనీలు అటువైపు చూస్తున్నాయి. ఈ క్రమంలో వినియోగదారులనుకాపాడుకునేందుకు కంపెనీ జీ-13 బొగ్గును రవాణా చేయాల ని సింగరేణి నిర్ణయించింది. కోల్ వాషరీ ద్వారా నా ణ్యమైన బొగ్గు అందించే అవకాశం ఉన్నా.. వాషరీలో సుమారు 40 శాతం బొగ్గు వృథాగా పోతోంది. మిగి లిన 60 శాతం మాత్రమే చేతికి వస్తుంది. ఈ నేపథ్యంలో జీ-13రకం బొగ్గురవాణా తప్పనిసరైందని అధికా రులు పేర్కొంటున్నారు. రానున్న వర్షాకాలం విద్యుత్ వినియోగం తగ్గి బొగ్గుడిమాండ్ లేకపోయినా.. నాణ్య మైన బొగ్గు సరఫరా చేస్తే విద్యుత్ సంస్థలు కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకునే అవకాశం ఉందని సింగరేణి అధికారులు భావిస్తున్నారు.

ఒప్పందం ప్రకారం నాణ్యమైన బొగ్గు..



ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం వినియోగదారులకు నాణ్యమైన గ్రేడ్ బొగ్గు ఇవ్వకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాల్సి వస్తుంది. నాణ్యమైన బొగ్గు సరఫరా చేయకుండా నష్టపరిహారం చెల్లించేకంటే గ్రేడ్ మిక్స్ చేసి రవాణా చేయటమే మేలు. కంపెనీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం.

–ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ ఆపరేషన్స్

కొంత నష్టం వచ్చినా తప్పదు..



సంస్థ రోజుకు సుమారు 1.60 వేల టన్నుల బొగ్గును విద్యుత్ సంస్థలకు రవాణా చేస్తుంది. ఈ క్రమంలో టన్నుకు రూ. వెయ్యి నష్టం వచ్చినా ఏ రోజు బొగ్గు ఆ రోజే రవాణా అవుతుంది. రోజుకు రూ. 2 లక్షల నష్టం జరిగినా రూ. 5 కోట్ల విలువైన బొగ్గు రవాణా జరుగుతుంది. అదే సమయంలో వినియోగదారులు కంపెనీ అండర్‌లో ఉంటారు.

–కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పీపీ

బైకర్ మెడలో నుంచి..

బంగారు గొలుసు లాక్కుని ఉడాయించిన యువకులు



పారిపోతున్న దుండగులు

పాల్వంచ: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మెడలో నుంచి ముగ్గురు వ్యక్తులు బంగారు గొలుసు లాక్కుని ఉడాయించారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడెం ఏరియాలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే నవభారత్ రిటైర్డ్ ఉద్యోగి అబ్రహం పీటర్ కిరాణా దుకాణానికి బైక్‌పై వెళ్తోస్తున్నాడు. ఈ క్రమంలో ఒడ్డుగూడెం రోడ్‌లో ముగ్గురు యువకులు మరో బైక్‌పై అతన్ని వెంబడించారు. రోడ్డుపై ఎవరూ లేనిది గమనించి అబ్రహం మెడలో ఉన్న సుమారు రెండున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కుని ఉడాయించారు. గొలుసు లాగడంతో అబ్రహం మెడకు గాయం కావడంతోపాటు మోటార్ సైకిల్‌పై నుంచి కింద పడిపోయాడు. సీఐ సతీష్, ఎస్ఐ సుమన్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించి, సీసీ ఫుటేజీలను పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీపీసీసీ జనరల్ సెక్రటరీగా రాగమయి

ఉమ్మడి జిల్లా నుంచి మరికొందరికి కూడా స్థానం

ఖమ్మం వన్‌టౌన్/సత్తుపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో జిల్లా నాయకులు పలువురికి స్థానం దక్కింది. ఈ మేరకు 27 మంది ఉపాధ్యక్షులు, 69 మంది ప్రధాన కార్యదర్శులతో ఏఐసీసీ నుంచి సోమవారం జాబితా విడుదలైంది. ఇందులో ప్రధాన కార్యదర్శులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సహా పలువురికి చోటు కల్పించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు చెందిన మద్దినేని బేబీ స్వర్ణకుమారి, నాగా సీతారాములు, కట్ల రంగారావు జాబితాలో ఉన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, కే.సీ.వేణుగోపాల్, సీఎం రేవంత్రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మా ఊళ్లో 'ప్రైవేట్' ప్రచారం చేయొద్దు

ప్రైవేట్ స్కూల్ బస్సును అడ్డుకున్న స్థానికులు

ములకలపల్లి: తమ గ్రామంలో ప్రైవేట్ స్కూల్ సంబంధిత ప్రచారం చేయొద్దంటూ స్థానికులు ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. మండల పరిధిలోని మొగరాలగుప్ప గ్రామంలో సోమవారం ఈ ఉదంతం జరిగింది. హెచ్ఎం కొటం స్వరూప కథనం ప్రకారం.. ములకలపల్లి మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ ఆవాస విద్యాలయ సిబ్బంది సోమవారం ప్రచార వాహనంలో మొగరాలగుప్ప గ్రామానికి వచ్చారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న క్రమంలో బడిబాట చేపడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయ బృందంతోపాటు స్థానికులు ప్రచార వాహనాన్ని అడ్డుకున్నారు. చిన్నారులను స్థానిక ప్రభుత్వ పాఠశాల్లోనే చదివిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో ప్రచారం ఆపేసి ఆపేసి వెనుదిగరి వెళ్లినట్లు హెఎం తెలిపారు. వీఓలు సుజాత, రామరాజు, గ్రామస్తులు కన్నారావు, లక్ష్మీ, వెంకటమ్మ, సీతమ్మ, రాంబాబు, లలిత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెల్దారుపల్లిలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: రాష్ట్రప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో సోమవారం పర్యటించిన మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మద్దులపల్లిలో రూ.94లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశాక డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. అలాగే, పోలేపల్లి -రాజీవ్‌గృహకల్ప కాలనీ ఎన్నెస్పీ లాకల వరకు రూ.2.86కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి, తెల్దారుపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజచేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదల కోసం గతంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నామని తెలిపారు. ఇదే సమయాన కొత్తగా ఉచిత విద్యుత్, సన్న ధాన్యానికి బోనస్, రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయానం, ఇంది రమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాలు మొదలు పెట్టామని వెల్లడించారు. అర్హులైన పేదలందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ చైర్మన్ బి.హరినాథ్‌బాబు, ఆర్‌డీఓ జి.నర్సింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ పి.రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కరామత్ అలీ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలో సోమవరం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వం నుంచి సరైన అనుమతులు లేకుండానే ఫీజులు, ఇతరత్రా పేర్లతో రూ.కోట్లలో దండుకున్నాయని ఆరోపించారు. జిల్లాలోనూ ఇలాంటి పరిస్థితులు ఉండగా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

బీఎల్ఓలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలి

కొత్తగూడెంఅర్బన్: బూత్‌స్థాయి అధికారులకు (బీఎల్ఓ) గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఈ నెల 25వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1200 మంది ఓటర్లు ఉన్న చోట కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల జాబితాను ఈ నెల 20వ తేదీ లోపు పంపించాలన్నారు. అవసరమైన చోట కొత్తగా బూత్ లెవెల్ అధికారులను నియమించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా స్థానికులై ఉండాలని, ఎవరూ అందుబాటులో లేనిపక్షంలో అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించవచ్చని వివరించారు. ఎస్ఎస్ఆర్-2026 ప్రక్రియ కోసం చేపట్టాల్సి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు తమకు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ రంగా ప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో జీపీ కార్యదర్శి మృతి

విధులకు వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఘటన



సోనాలి (ఫైల్)

పెనుబల్లి/రఘునాథపాలెం: స్కూటీపై విధులకు బయలుదేరిన పంచాయతీ కార్యదర్శిని వెనుక నుండి లారీ ఢీకొట్టడంతో అదే లారీ టైరు కింద పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో సోమవారం జరిగిన ఈ క్రమం వివరాలిలా ఉన్నాయి. రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన బానోతు సోనాలి(32) పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త సంపత్ కల్లూరు మండలం లక్ష్మాతండా కాగా వీరికి ఏడాది, నాలుగేళ్ల వయస్సు పిల్లలు ఉన్నారు. కల్లూరు నుంచి రాకపోకలు సాగించే ఆమె రోజులాగే సోమవారం తన స్కూటీపై వెళ్తుండగా అదే మార్గంలో ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపునకు వెళ్తున్న లారీ వీఎం బంజర్ ప్రాథమిక పాఠశాల సమీపాన ఢీకొట్టింది. దీంతో సోనాలి అదుపుతప్పి రోడ్డుపై పడగా, ఆమె పైనుంచి లారీ వెళ్లడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు. సోనాలి మృతిపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సంతాపం తెలపగా, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఈఓ ఉపేంద్రయ్య, పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు.

బూడిదంపాడులో అంత్యక్రియలు

గ్రామపంచాయతీ బానోత్ సోనాలి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం ఆమె స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ నివాళులర్పించారు. కాగా, పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ కార్యదర్శులపై పనిభారం పెరగడంతో ఆ ఒత్తిడితో వెళ్తున్న ఆమె ప్రమాదం బారిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోనాలి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ఆమె కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అలాగే, పంచాయతీ కార్యదర్శులకు నిర్దిష్ట పనివేళలు, స్పష్టమైన జాబ్ చార్ట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు దుర్గాప్రసాద్, యర్రా రమేష్, కరణ్‌సింగ్, రుక్మారావు, ఫజల్, వినోద్, గాంధీ, ఉపేందర్, అనిత, సుష్మిత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన డ్రైవర్ల ఘర్షణ

మధిర: మధిర మండలంలోని దెందుకూరు సమీ పాన ఓ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేస్తున్న ఇద్దరు లారీ డ్రై వర్ల మధ్య మొదలైన చిన్న గొడవ పెద్దదై ప్రాణాలు తీసే వరకు వెళ్లింది. అసోంకు చెందిన లారీ డ్రైవర్ మృతి చెందిన ఈ ఘర్షణ వివరాలిలా ఉన్నాయి. కన్‌స్ట్రక్షన్ కంపెనీలో బిహార్ రాష్ట్రం శివాన్ జిల్లా మదనపట్టికి చెందిన సుమంత్ కుమార్ పాండే(37), ఒడిశా రాష్ట్రానికి చెందిన శివ బిషోయ్ తది తరులు లారీడ్రైవర్లగా పనిచేస్తున్నారు. సుమంత్ అసోం రాష్ట్రానికి చెందిన మహిళను ప్రేమ వివా హం చేసుకోగా వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఆమె పిల్లలతో కలిసి అసోంలోనే ఉంటోంది. కాగా, లారీ డ్రైవర్లు సహా సిబ్బంది దెందుకూరు సమీపాన కంపెనీ క్వార్టర్లలో నివాసముంటున్నారు. ఆదివారం రాత్రి శివ బిషో య్ భోజనం చేశాక ప్లేట్ కడిగిన నీటిని కింద పోస్తూ వెళ్తున్నాడు. దీంతో సుమంత్ కుమార్ పాండే తన గది ముందు ప్లేట్ కడిగిన నీటిని ఎందుకు పోశావని శివపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇనుప రాడ్డుతో దాడికి యత్నించాడు. అక్కడి కూలీలు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. కొద్ది గంటల తర్వాత శివ మూత్రవిర్జనకు వెళ్లి వస్తుండగా ఆరుబయట మంచంపై పడుకున్న సుమంత్ తిరిగి ఆయనను దూషించినట్లు తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన శివ బిషోయ్ పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తీసుకొని దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన సమంత్‌ను మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న వైరా ఏసీపీ రహమాన్, మధిర సీఐ మధు, మధిర రూరల్ పోలీసులు సోమవారం ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అప్పటికే నిందితుడు శివ పారిపోవడంతో ఆయన సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి 16నుంచి పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి మూడంచెల్లో పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 16నుంచి 19వ తేదీ వరకు మండల స్థాయి, 25, 26వ తేదీల్లో జిల్లాస్థాయి, జూలై 1నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్ స్టాండింగ్ బ్రాడ్‌జంప్, 800 మీటర్ల పరుగు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని, వివరాలకు ఖమ్మం పటేల్ స్టేడియంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.